చంద్రబాబు మోసాలను ఇంటింటికీ వివరించాలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు



ఎర్రగుంటపల్లిలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం



గణిజర్లలో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చింతలపూడి: ప్రజలకు సంక్షేమ పాలన అందించడంలో, రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు అన్నారు. మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎస్ రమేష్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం గ్రామ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయరాజు మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసగించారని.. కార్యకర్తలు, నాయకులు చంద్రబాబు మోసాలను ఇంటింటికి వెళ్లి వివరించాలన్నారు. భవిష్యత్తులో వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారం చేపట్టడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం బాబు షూరిటీ– మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్ ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు జగ్గవరపు జానకి రెడ్డి, మండల అధ్యక్షుడు ఎస్ రమేష్ రెడ్డి, జెడ్పీటీసీ ఎస్ నీరజ సుధాకర్, సర్పంచ్ తుల్లిమిల్లి రాణి, రైతు విభాగం నాయకులు అలవాల ఖాదర్ బాబు రెడ్డి, సీతారామిరెడ్డి, బుల్లా దాస్, దినేష్ రెడ్డి, టీ శ్రీను, కె సర్వేశ్వరరావు, ఎన్.సందీప్, ప్రగడవరం సర్పంచ్ భూపతి తదితరులు పాల్గొన్నారు.

గణిజర్లలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ

కూటమి 15 నెలల పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు ధ్వజమెత్తారు. మండల అధ్యక్షుడు రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో గణిజర్ల గ్రామంలో గ్రామస్థాయి విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఉచిత బస్సు పథకంలో అనేక ఆంక్షలు విధిస్తూ మహిళలను తీవ్రంగా మోసగించారని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు జగ్గవరపు జానకిరెడ్డి విమర్శించారు. ప్రజల తరపున ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తే ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి గొంతు నొక్కాలని చూస్తున్నారని ఆరోపించారు. అనంతరం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నీరజ సుధాకర్, ఎంపీపీ డా బి రాంబాబు నాయక్, గణిజర్ల సర్పంచ్ ఎ వెంకట్రావు, మండల యువజన నాయకులు సురేష్, ఏసుబాబు, చింత రాణి, నరసింహారావు, రవీంద్ర, భరత్ రెడ్డి, శేఖర్ పార్టీ నేతలు, అభిమానులు పాల్గొన్నారు.

అరకొరగా సంక్షేమం.. అలవాటైన మోసం



పాశ్వానగరంలో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న విజయరాజు, నేతలు

లింగపాలెం: చంద్రబాబు మాయ మాటలకు ప్రజానీకం నిలువునా మోసపోయారని వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు అన్నారు. పాశ్వానగరంలో ఆదివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ హయాంలో పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాది లోపే ఎన్నికల హామీలన్నింటినీ అమలు చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం మాత్రం గద్దెనెక్కి 15 నెలల కాలం గడిచినా రెండు, మూడు పథకాలు.. అవి కూడా అరకొరగా అమలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. రాబోయే రోజుల్లో వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, పార్టీ అభివృద్ధికి పాటుబడిన ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ లింగపాలెం మండల అధ్యక్షుడు అన్నపనేని శాంతారావు, పార్టీ నాయకులు కె రఘు, మండల యూత్ అధ్యక్షుడు చీదరాల ప్రసాద్, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

పాశ్వానగరం గ్రామ కమిటీ ఎన్నిక

పాశ్వానగరం వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీని మండల అధ్యక్షుడు అన్నపనేని శాంతారావు ప్రకటించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కఠికినేని రఘుబాబు, ప్రధాన కార్యదర్శులుగా తాళ్లూరి ఏడుకొండలు, యంత్రపాటి దుర్గరావు, పొన్నుబోయిన ప్రసాదరావు, కార్యదర్శులుగా తొమ్మండ్రు రవి, సొంగా సురేష్, అబ్బదాసరి రాజేష్, సిర్రా వెంకటేశ్వరరావు, ఆమదాల ప్రసాద్, అబ్బదాసరి రాజారావు ఎన్నికయ్యారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తామని నూతన కార్యవర్గం తెలిపింది.

క్లుప్తంగా

చింతాలమ్మ హుండీ ఆదాయం లెక్కింపు



చింతాలమ్మ ఆలయ హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: గ్రామదేవత శ్రీచింతాలమ్మ అమ్మవారి ఆలయ హుండీ ఆదాయాన్ని ఆదివారం లెక్కించారు. ఆరు నెలలకుగాను రూ.54 వేలు ఆదాయంగా లభించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. త్వరలో అమ్మవారి నూతన ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు. ఇందుకు ఫిక్స్‌డ్ డిపాజిట్లుగా ఉన్న సుమారు రూ.50 లక్షలతోపాటు దాతలు అందజేసిన దాదాపు మరో రూ.60 లక్షలు విరాళాలు కలిపి రూ.2 కోట్ల అంచనాతో నూతన ఆలయం రూపుదిద్దుకోనుందన్నారు.

ముగిసిన జానపద ఉత్సవాలు



జానపద ఉత్సవాల్లో ప్రదర్శన నిర్వహిస్తున్న కళాకారులు

జంగారెడ్డిగూడెం: ప్రపంచ జానపద కళాకారుల దినోత్సవం సందర్భంగా మూడు రోజులుగా నిర్వహిస్తున్న జానపద ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. స్థానిక కె.కన్వెన్షన్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో కళాకారులు పాల్గొని వివిధ సాంస్కృతి ప్రదర్శనలు నిర్వహించారు. రాష్ట్ర జానపద కళాకారుల సంఘం అధ్యక్షుడు ఎల్ఆర్ కృష్ణబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు కళాకారులు సినీ నటులను సత్కరించారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి



వేగవరం సొసైటీ చైర్మన్ ఆలపాటి దుర్గారాం ప్రసాద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: వేగవరం సొసైటీ చైర్మన్‌గా నియమితులైన ఆలపాటి దుర్గారాం ప్రసాద్ (రాము)ను జంగారెడ్డిగూడెం ఆప్ లాండ్ ఉద్యాన నర్సరీ ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం రామును అసోసియేషన్ సభ్యులు, పలు రైతులు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మహంకాళి శ్రీనివాసరావు, తూము శ్రీనివాసరావు, బూరుగుపల్లి రవీంద్ర, కామన రంగా, వేగేశ్న విజయ్, చలం, కొణతం సత్తిబాబు, బడేటి కృష్ణమూర్తి, ఉమామహేశ్వరరావు, నక్క వీర కృష్ణ, గౌస్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్సై రాజారెడ్డి

కుక్కునూరు: ఆటో డ్రైవర్లు వాహనాలను నడిపేటప్పుడు ట్రాఫిక్ రూల్స్‌ను తప్పనిసరిగా పాటించాలని కుక్కునూరు ఎస్సై రాజారెడ్డి సూచించారు. ఆదివారం కుక్కునూరు ఆటో డ్రైవర్లనుస్టేషన్‌కు పిలిపించి పలు సూచనలు చేశారు. వాహనాలను నడిపేటప్పుడు అతివేగంగా, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయరాదని, ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని వాహనాలను నడపాలని వివరించారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇతర పత్రాలను ఎల్లప్పుడు తమ వద్దనే ఉంచుకోవాలని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



తీవ్ర గాయాలతో రాము

కుక్కునూరు: రెండు బైక్‌లు ఢీ కొన్న ఘటనలో ఓ యువకుడికి తీవ్రగాయాలు కాగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాల ప్రకారం కుక్కునూరు గ్రామానికి చెందిన వనమా రాము(24) బైక్‌పై ప్రభుత్వ కాలేజీ నుంచి సబ్‌స్టేషన్ రోడ్డుపైకి వస్తుండగా కిష్టారం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ఎదరుగా బైక్‌పై రావడంతో రెండు వాహనాలు బలంగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో రాముకి తీవ్ర గాయాలు కాగా మరో బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. స్థానికులు క్షతగాత్రుడిని వెంటనే 108 వాహనంలో చికిత్స నిమిత్తం కుక్కునూరు ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

నేడు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం

కొయ్యలగూడెం: మంగపతిదేవిపేట, బోడిగూడెం పంచాయతీల పరిధిలో సోమవారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీటీసీ, మాజీ సర్పంచ్ తేలే శ్రీనివాస్ పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి మంగపతి దేవిపేట గ్రామం నుంచి కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు హాజరవుతారని పార్టీ శ్రేణులు, అనుబంధ విభాగాల సభ్యులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాల్సిందిగా సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం 132 కేవీ సబ్ స్టేషన్ నుంచి మైసన్నగూడెం సబ్ స్టేషన్ వరకు ట్రీ కటింగ్, మరమ్మతు పనుల నిమిత్తం సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఈఈ అహ్మద్‌ఖాన్ తెలిపారు. మైసన్నగూడెం, ములగలంపల్లి, పి.నారాయణపురం, రాచన్నగూడెం, వేలేరుపాడు, కుక్కునూరు, రాజీవ్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని రకాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

జీవనాధారం.. మా బొజ్జ గణపయ్య



ధర్మాజీగూడెంలో వినాయక విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్న తయారీదారుడు

- వినాయక విగ్రహాల తయారీతో ఉపాధి
- చవితికి ముస్తాబైన గణనాథుని విగ్రహాలు

లింగపాలెం: చవితి వేడుకలకు మరో రెండు రోజులే మిగిలి ఉండడంతో మార్కెట్లో గణనాథుల విగ్రహాలు విక్రయానికి సిద్ధమవుతున్నాయి. కళాకారులు గణేష్ విగ్రహాలకు తుదిమెరుగులు దిద్దుతున్నారు. హైదరాబాద్ నుంచి ధర్మాజీగూడెంలో స్థిరపడిన పి.వెంకటేశ్వరరావు వినాయక విగ్రహాలు తయారుచేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. గతంలో ఈ ప్రాంతం వారు ఏలూరు, చింతలపూడి, విజయవాడ వంటి ప్రాంతాలకు వెళ్లి మొద్ద మొత్తంలో ఖర్చు చేసి ఆటోలు, లారీలపై గణనాథుల విగ్రహాలు తీసుకువచ్చేవారు. ఇప్పుడు ధర్మాజీగూడెం ప్రాంతంలోనే వినాయక విగ్రహాలు అందుబాటులోకి రావడంతో వ్యయప్రయాసలు తగ్గాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు. 3 అడుగుల నుంచి 12 అడుగుల ఎత్తువరకు కలిగిన వినాయక విగ్రహాలు ధర్మాజీగూడెంలో అందుబాటులో ఉండగా వీటి ధర రూ.2 వేల నుంచి రూ.25 వేల వరకు విక్రయిస్తున్నారు.

ఇదే జీవనాధారం



మా పూర్వీకుల నుంచి విగ్రహాలు తయారీ చేస్తున్నాం. నేను కూడా విగ్రహాలను తయారీ చేసి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాను. ఏటా మూడు నెలల ముందు నుంచే ఏర్పాట్లు సిద్ధం చేసుకుంటాం. మూడు అడుగుల నుంచి 12 అడుగుల ఎత్తు వరకు వినాయక విగ్రహాలు అమ్ముడుపోతే ఆశించిన లాభాలు వస్తాయి. లేదంటే నష్టం భరించాలి.

– పి వెంకటేశ్వరావు, విగ్రహాల తయారీదారుడు, ధర్మాజీగూడెం

ముగిసిన వాలీబాల్ పోటీలు

జంగారెడ్డిగూడెం: ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా స్థానిక గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో 17వ గ్రామోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలు ముగిశాయి. వీటిలో చింతలపూడి ప్రథమ స్థానం, రెడ్డి గణపవరం ద్వితీయ స్థానం, బుట్టయిగూడెం మూడవ స్థానం, దిబ్బగూడెం నాలుగవ స్థానం సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం జరిగిన కార్యక్రమానికి జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గ్రామీణ యువతను ప్రోత్సహించడానికి ఈ క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి రాముడు, పాలపర్తి శ్రీనివాస్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ధనరాజు, విశ్రాంత వ్యాయమ ఉపాధ్యాయులు నరసింహారాజు, ఈషా ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ జయసాయి, సత్య గంగాధర్, ఇతర ఈషా వాలంటీర్లు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

ద్వారకాతిరుమల: మండలంలోని గుళ్లపాడు గ్రామ శివారులో ఓ కోడిపందేల స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 4 గురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ. 8,100 నగదు, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

వరల్డ్ ట్రాన్స్‌ప్లాంట్ గేమ్స్‌లో పతకం



జర్మనీలో జరిగిన పోటీల్లో పతకం సాధించిన సుంకర నాగవాసు (ఇన్‌సెట్లో నాగ వాసు)

కొయ్యలగూడెం: వరల్డ్ ట్రాన్స్‌ప్లాంట్ గేమ్స్ - 2025 పోటీల్లో కొయ్యలగూడెంకి చెందిన సుంకర నాగవాసు నాయుడికి పతకం లభించింది. ఆయన జంగారెడ్డిగూడెం అటవీ శాఖ కార్యాలయంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈనెల 23వ తేదీన జర్మనీలోని డ్రెస్డెల్ నగరంలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని, రేస్ వాక్ 5వేల మీటర్ల పందెం విభాగంలో ద్వితీయ స్థానం పొంది రజత పతకం సాధించినట్లు బంధువులు ఏఎస్సై వైఎస్ చందు, రెడ్డి నాయుడు తెలిపారు. రెండేళ్ల కొకసారి ప్రపంచ స్థాయిలో ఈ పోటీలు జరుగుతుంటాయని, గతంలో మెక్సికోలో జరిగిన పోటీల్లో కూడా నాగ వాసు పాల్గొన్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా కొయ్యలగూడెంలోని కుటుంబీకులకు పలువురు అభినందనలు తెలిపారు.

అక్రమ టోల్‌పై చర్యలేవి?

కుక్కునూరు: మండలంలోని పెద్దరావిగూడెం, గణపవరం, ఇబ్రహీంపేట, బంజరగూడెం, బోనగిరి, అల్లిగూడెం, వేలేరు గ్రామాల్లో వెయ్యికి పైగా నర్సరీలను ఎటువంటి అనుమతులు లేకుండా గిరిజన భూముల్లో గిరిజనేతరులు అక్రమంగా నిర్వహిస్తున్నారని సీపీఎం జిల్లా నాయకుడు యర్రంశెట్టి నాగేందర్‌రావు ఆరోపించారు. ఆదివారం కుక్కునూరులో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమంగా నిర్వహిస్తున్న జామాయిల్ నర్సరీలపై అధికారులు చర్యలు తీసుకోవడంలేదని విమర్శించారు. దీనికి తోడు బయట పెద్దరావిగూడెం గ్రామ పంచాయతీలు బయట వ్యక్తులకు వేలంపాట పేరుతో ఇచ్చి అక్రమంగా టోల్ పన్ను వసూలు చేస్తున్నారన్నారు. జామాయిల్ మొక్కలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నప్పటికీ స్థానిక వ్యాన్, మినీ వ్యాన్ డ్రైవర్లకు ఉపాధి ఉండడం లేదన్నారు. అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం మండల నాయకులు యర్నం సాయికిరణ్, షేక్ వలీపాషా, శ్యామల లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సురవరం మృతి తీరని లోటు

కొయ్యలగూడెం: సురవరం సుధాకర్ రెడ్డి మరణం సీపీఐకి, నిరుపేదలకు తీరని లోటు అని ఆ పార్టీ సీనియర్ నాయకుడు దుగ్గిరాల నారాయణరావు పేర్కొన్నారు. యర్రంపేట గ్రామంలో నారాయణరావు ఆధ్వర్యంలో సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చింతలపూడి దుర్గారావు పాల్గొన్నారు.

కుక్కునూరు: మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి మృతి దేశానికి, వామపక్ష, ప్రజాస్వామ్య ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ కుక్కునూరు మండల కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య ప్రకటనలో పేర్కొన్నారు.

27న గణపతి ఆలయ ప్రారంభోత్సవం



ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న గణపతి ఆలయం

కొయ్యలగూడెం: స్థానిక గణేష్ సెంటర్లో పునర్నిర్మించిన శ్రీ విఘ్నేశ్వర ఆలయం ఈనెల 27న ప్రారంభోత్సవానికి ముస్తాబవుతోంది. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆరోజున ఆలయ ప్రారంభోత్సవం నిర్వహిస్తున్నట్లు గణపతి యువజన సేవా సంఘం తెలిపింది. సుమారు 80 ఏళ్ల క్రితం నిర్మించిన ఆలయం జీర్ణోద్ధరణ చెందడంతో నూతనంగా రూ.25 లక్షల వ్యయంతో ఆలయాన్ని పునర్నిర్మించారు. నాలుగు రోడ్ల జంక్షన్‌లో ఆలయం ఉండడంతో పాటు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అత్తిలి తరువాత ఉత్సవాల నిర్వహణకు కొయ్యలగూడెం గణేష్ సెంటర్‌లోని ఆలయం ప్రఖ్యాతిగాంచింది. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవా సామాజిక కార్యక్రమాల్లో భాగంగా టీటీడీ కల్యాణ మండపానికి, బాలికల సంక్షేమ వసతి గృహం ఏర్పాటుకు చెరో ఎకరం మేర భూములను గణపతి యువజన సేవా సంఘం ఆలయ నిధులను కేటాయించి సేవా కార్యక్రమాలు కూడా నిర్వహించారు. ఉత్సవాలకు అనిపెద్ది పరదేశి ప్రసాద శర్మ ఆధ్వర్యంలో ఆధ్యాత్మికవేత్తలను ఆహ్వానిస్తున్నట్లు కమిటీ పేర్కొంది.

'స్త్రీశక్తి' అమలు చేయాలి

ఏలూరు (టూటౌన్): అంతర్రాష్ట్ర సర్వీసుల పేరుతో సాధారణ పల్లె వెలుగు బస్సుల్లో సైతం స్త్రీ శక్తి పథకం అమలు చేయకపోవడం అన్యాయమని తెలంగాణ రాష్ట్రంలో మాదిరిగా రాష్ట్ర సరిహద్దు వరకు మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మన రాష్ట్రంలోని ఆర్టీసి పల్లె వెలుగు బస్సులను పక్క రాష్ట్రంలోని డిపోలకు నడిపే సందర్భాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో బస్సు నడిచేంతవరకు మహిళలకు ఫ్రీ బస్సు పథకం స్త్రీ శక్తి అమలుచేయాలని ఆయన కోరారు.

రహదారికి స్వచ్ఛందంగా మరమ్మతులు



సూర్యచంద్రరావుపేట మలుపులో గుంతలను కాంక్రీటుతో పూడ్చిన దృశ్యం

ద్వారకాతిరుమల: భీమడోలు–ద్వారకాతిరుమల క్షేత్ర ప్రధాన రహదారి పలుచోట్ల ధ్వంసమైంది. పెద్దపెద్ద గోతులు ఏర్పడటంతో వివిధ ప్రాంతాల నుంచి శ్రీవారి దర్శనార్థం ద్వారకాతిరుమలకు వెళుతున్న భక్తులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు పడిపోయి, క్షతగాత్రులు అవుతున్నారు. ఈ విషయం అధికారులు, పాలకుల దృష్టికి వెళ్లినా వారు స్పందించడం లేదు. దాంతో ప్రమాదాలను చూడలేక సూర్యచంద్రరావుపేట గ్రామానికి చెందిన వారు తమ గ్రామ శివారులోని రహదారి మలుపులో ఉన్న గుంతలను ఆదివారం కాంక్రీట్‌తో పూడ్చారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ జిల్లా కార్యదర్శి కె.రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): బాల్య వివాహాలకు సంబంధించి ఒక్క కేసు కూడా నమోదు కాకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం వెన్నవెల్లివారిపేటలో ఆదివారం బాల్య వివాహాలు– గర్భధారణ వల్ల కలిగే నష్టాలు పైన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు 18 ఏళ్లు, పురుషులకు 21 ఏళ్లు నిండిన తరువాత మాత్రమే వివాహాలు జరిపించాలని అన్నారు. బాల్యదశలో వివాహాలు జరిపించడం వల్ల బాలికలకు ఆరోగ్య సమస్యలు సంభవించడమే కాకుండా కొన్ని పరిస్థితుల్లో తల్లి, బిడ్డ మరణాలు సంభవిస్తున్నాయన్నారు. 18 సంవత్సరాలు నిండిన తర్వాత మాత్రమే మహిళలు పూర్తి ఆరోగ్యంగా ఉంటారని, పుట్టిన బిడ్డ కూడా ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. కాబట్టి వివాహ వయస్సు దాటిన తర్వాత మాత్రమే వివాహాలు జరిపించాలని సూచించారు. ఎలాంటి న్యాయ సహాయం కావాల్సి ఉన్నా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థలను కాని 15100 నంబర్‌కు గానీ ఫోన్ చేయాలని కోరారు. ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్ మాట్లాడుతూ పొరులు ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. విద్య లేకపోవడం వల్ల బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను తెలుసుకోలేరని, కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉన్నత చదువులు నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డెమో డాక్టరు దీపిక, సీడబ్ల్యూసీ ఇన్‌చార్జి చైర్మన్ పి.వెంకటేశ్వర రావు, మాస్టరు ట్రైనీ పి.రత్నరాజు, ఏలూరు గిరిజనుల సంఘ ప్రెసిడెంటు కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఖరీఫ్ పనులు



దుద్దుకూరు సమీపంలో ప్రత్తి పంటలో దుక్కుదున్నుతున్న దృశ్యం




తెల్లంవారిగూడెం సమీపంలో మినుము పంట వేసిన దృశ్యం

బుట్టాయగూడెం: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో ఖరీఫ్ సాగు పనులు ఊపందుకున్నాయి. మండలంలోని ప్రతి గ్రామంలో ముమ్మరంగా పనులు జరుగుతున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వరినాట్లు వేసి వర్షాల కోసం ఎదురు చూస్తున్న రైతులకు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో వర్షాలు విస్తారంగా కురవడంతో రైతులకు కొంత ఊరట లభించింది. దీనితో వరినాట్లను ముమ్మరంగా వేయడంతోపాటు ప్రత్తి, మొక్కజొన్న, మినుము, వేరుశనగ, తదితర పంటలను విస్తారంగా వేశారు.

ఊపందుకున్న సాగు పనులు

ఖరీఫ్ సీజన్‌లో బుట్టాయగూడెం మండలంలో వరిసాగు 4,246 ఎకరాలు లక్ష్యం కాగా ఇప్పటివరకూ దాదాపు 1,650 ఎకరాల్లో వరి సాగు చేసినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా జీలుగుమిల్లి మండలంలో 2,658 ఎకరాలు లక్ష్యం కాగా సుమారు 2,005 ఎకరాల్లో వరినాట్లు వేశారు. అదేవిధంగా పోలవరం మండలంలో 5,582 ఎకరాలు లక్ష్యం కాగా ఇప్పటివరకూ 3,685 ఎకరాల్లో వరినాట్లు పడ్డాయి. అదేవిధంగా కొయ్యలగూడెం మండలంలో 9,115 ఎకరాలు లక్ష్యంకాగా ఇప్పటివరకూ 6,350 ఎకరాల్లో వరినాట్లు వేసినట్లు అధికారులు చెప్పారు. అదేవిధంగా టి.నర్సాపురం మండలంలో 2,400 లక్ష్యంకాగా 1,410 ఎకరాల్లో వరినాట్లు వేశారు. అదేవిధంగా వేలేరుపాడు మండలంలో 2,305 ఎకరాలు లక్ష్యంకాగా ఇప్పటివరకూ 350 ఎకరాల్లో మాత్రమే వరినాట్లు వేశారు. అదేవిధంగా వేలేరుపాడు మండలంలో 1,381 ఎకరాలు లక్ష్యంకాగా కేవలం 70 ఎకరాల్లో మాత్రమే వరినాట్లు వేసినట్లు అధికారులు తెలిపారు. అయితే ప్రత్తి, మినుము, వేరుశనగ పంటలను కలిపి మొత్తం 50,909 ఎకరాలకు గాను ఇప్పటివరకూ 22,654 ఎకరాల వరకూ సాగు నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు.

అధికారుల సూచనలు పాటించాలి



ఖరీఫ్ సీజన్‌లో పంటలు పండించే రైతులు నాణ్యమైన దిగుబడులు సాధించాలంటే తప్పనిసరిగా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించాలి. అప్పుడే దిగుబడులు అధికంగా వస్తాయి.

– కె.గంగాధరం, మండల వ్యవసాయాధికారి, జీలుగుమిల్లి మండలం